పాఠశాలల్లో బోనాలు 8
నాచగిరిలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం 7

8 డెంగీ కేసులు

464 మందికి జ్వరం

730 బృందాలతో ఇంటింటా జ్వర సర్వే

సిద్దిపేట టౌన్, జూలై 27 : వర్షాకాలం నేపథ్యంలో పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు, వాటిని గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జ్వర సర్వే చేపట్టాలని ఈ నెల 24న ఆదేశాలిచ్చింది. జిల్లాలోని 33 పీహెచ్‌సీ, 2 అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో జర్వ పీడిత బాధితుల్ని గుర్తించి వారి వివరాలను నమోదు చేస్తున్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా వైరల్ ఫీవర్, మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యాతో పాటు పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 464 మంది రోగులు జ్వరంతో బాధపడుతున్నట్లు సర్వేలో గుర్తించారు. జ్వరం వచ్చిన రోగుల నుంచి సేకరించిన శాంపిల్స్‌తో డెంగీ, మలేరియా పరీక్షలను నిర్వహించారు. మలేరియా లేనట్లుగా ఇప్పటివరకు వైద్యులు నిర్ధారించగా, 8 డెంగీ కేసులు యాక్టివ్‌గా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వారిని పలు ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

1,08,942 ఇళ్లల్లో సర్వే పూర్తి

జిల్లావ్యాప్తంగా 3.40 లక్షల నివాసాలున్నట్లు వైద్య శాఖ అధికారులు గుర్తించగా, 730 బృందాలతో సర్వే కొనసాగిస్తున్నారు. ఒక్కో బృందంలో ఏఎన్ఎంలతో పాటు ఆశావర్కర్‌లు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్), మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొంటున్నారు. ఒక్కో బృందం రోజుకు 50 ఇళ్లకు వెళ్లి జ్వర సర్వే చేస్తున్నది. నాలుగురోజుల్లోనే వైద్య అధికారులు, సిబ్బంది 1,08,942 ఇళ్లను సందర్శించారు. జ్వర కేసులను గుర్తిస్తే వాటిని సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రెఫర్ చేస్తున్నారు. అక్కడి మెడికల్ ఆఫీసర్ జ్వర బాధితులను పరీక్షించి, అవసరమనుకున్న కేసుల్ని సమీపంలోని ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యాన్ని అందించనున్నారు.


భొంపల్లి గ్రామంలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధులపై అవగాహన

జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు, డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులు కృషి చేస్తున్నారు. పట్టణాల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో దోమల మందు పిచికారీ చేయడంతో పాటు ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. గుంతల్లో నిలిచిన వర్షపు నీటిలో దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు దోమల మందులను పిచికారీ చేయిస్తున్నారు. పది రోజుల నుంచి కురుస్తున్న వానలకు ఇళ్లల్లో నీటి తొట్లలో నిండిన వర్షపు నీరును, హౌజులు, డ్రమ్ములలో నిల్వ ఉంచిన నీటిని డ్రైడే పేరిట అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పారబోస్తున్నారు.


సిద్దిపేటలో డ్రమ్ములో నిల్వ ఉన్న నీరును పారబోస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి

ప్రతీ ఇంట్లో సర్వే చేస్తాం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వేగంగా జ్వర సర్వేను నిర్వహిస్తున్నాం. ఒక ఆశా కార్యకర్త, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎం తదితర సిబ్బందితో 730 బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు జిల్లాలో విస్తృతంగా సర్వే చేసి లక్షకుపైగా ఇళ్లను సందర్శించి 464 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించాం. దాంతో పాటు సిబ్బంది రోజు వారీగా చేస్తున్న సర్వే వివరాలను అధికారిక పోర్టల్‌లో పొందుపరుస్తున్నాం.

- పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌వో

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ లేకుండా చూడాలి. సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సేవలందించేందుకు అన్ని వేళలా వైద్యులు అందుబాటులో ఉంటారు. జ్వర లక్షణాలు కనిపిస్తే దగ్గరిలోని ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలి. జీజీహెచ్ ఆసుపత్రిలో అన్ని ఏర్పాట్లు చేశాం.

-డాక్టర్ కిషోర్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్


మెట్ట రైతుల ఆశల సాగు

- వరుణుడి కరుణపైనే వ్యవసాయం
- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సాగు ముమ్మరం
- చినుకు కురుస్తున్నా.. నిండని చెరువులు
- శనిగరం ప్రాజెక్టు, ఎల్లమ్మ చెరువు, తోటపల్లి రిజర్వాయర్లకు వరద అంతంతే !

హుస్నాబాద్, జూలై 27 : వరుణుడి కరుణపై ఆధారపడి వ్యవసాయం చేసే మెట్ట రైతులకు ప్రస్తుతం పడుతున్న వర్షాలు ఊరటనిస్తున్నాయి. నీటి వనరులు లేక ప్రతీసారి మబ్బులకేసి ఎదురుచూసే అన్నదాతలకు ఈ వర్షాలు సాగుపై ఆశలు కల్పిస్తున్నాయి. గతేడాదిలాగే వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని వరుణుడిని ప్రార్థిస్తున్నారు. పడిన వర్షాలతో ఇప్పటికే దుక్కులు దున్ని విత్తనాలు వేశారు. ఎడతెరిపి లేకుండా పడుతున్న ముసురుతో వరి నాట్ల పనులను ముమ్మరం చేశారు. నిత్యం కరువుతో విలవిలలాడుతూ వ్యవసాయంపై ఆశలు చంపుకున్న ఈ ప్రాంత రైతాంగానికి గత మూడేళ్ల నుంచి సకాలంలో పడుతున్న వర్షాలు సాగుపై భరోసా కల్పిస్తున్నాయి.

సాధారాణ వర్షపాతానికి మించి..

ఈసారి తొలకరి ఆలస్యంగా పలకరించినా జూన్ నెల నుంచే సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ నమోదైంది. హుస్నాబాద్ డివిజన్‌లోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి, ధూళిమిట్ట, మద్దూరు మండలాల్లో జూన్ నెలలో సాధారణ వర్షాపాతం 109.08 మిల్లీమీటర్లు కాగా 219.7 మీ.మీ. వర్షాపాతం నమోదైంది. జూలై నెలలో సాధారణ వర్షపాతం 166.63 మీ.మీ. కాగా 201.25 మీ.మీ. వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు వర్షాలు పడుతుండటంతో గతానికి భిన్నంగా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.


సగం కూడా నిండని హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు

నిండని చెరువులు, కుంటలు

ఎడతెరిపి లేకుండా వర్షం పడుతున్నా ఇప్పటికీ డివిజన్‌లోని చెరువులు, కుంటలు, ఇతర జలాశయాలు నిండేలా నీరు చేరలేదు. హుస్నాబాద్ డివిజన్‌లో ఉన్న శనిగరం ప్రాజెక్టు, బెజ్జంకిలోని తోటపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తో పాటు పలు చెరువుల్లో కొంత నీరు ఉండగా ప్రస్తుతం పడుతున్న వర్షాలతో నారు పోసి పొలాలను దున్నుతున్నారు. వరుణుడు కరుణించి మెట్ట ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపి తమ ఆశల సాగును గట్టెక్కించాలని రైతులు వేడుకుంటున్నారు. శాశ్వత నీటి వనరులుంటే తమకు మబ్బులకేసి చూసే ఇబ్బందులు తప్పేవని, అందుకే లక్ష ఎకరాలకు సాగు నీరందించే మెట్ట ప్రాంత వరప్రదాయిని గౌరవెల్లి ప్రాజెక్టును త్వరితగతిన నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

1.20 లక్షల ఎకరాల్లో సాగు అంచనా

హుస్నాబాద్ డివిజన్‌లో వర్షాల ఆధారంగా సాగు విస్తీర్ణం ఆధారపడి ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. గత వానాకాలంలో జూలై చివరివారం వరకు నాట్లు వేయలేదు. ప్రస్తుతం 20 శాతం వరకు నాట్లు పడ్డాయి. హుస్నాబాద్ డివిజన్‌లోని హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి, అక్కన్నపేట, మద్దూర్, ధూళిమిట్ట మండలాల్లో 1,60,612 ఎకరాల సాగుకు యోగ్యమైన భూమి ఉండగా గత వానాకాలం సీజన్‌లో 1.10 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం ఇప్పటివరకు 50 శాతానికిపైగా సాగు జరిగింది. ఆగస్టు చివరి వరకు కూడా సాగు చేయడానికి అవకాశం ఉండటంతో గతం కంటే పెరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. అదే కాకుండా జూన్‌లో వర్షాలు ఆలస్యంగా రావడంతో పత్తి వంటి పంటలు వేయడానికి అవకాశం దొరకలేదు. దీంతో వరి వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం హుస్నాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, బెజ్జంకి, కోహెడ మండలాల్లో ఇప్పటి వరకు పలు పంటలను సాగు చేశారు. ఇందులో 8,685 ఎకరాల్లో వరి, 10,891 ఎకరాల్లో పత్తి, 1083 ఎకరాల్లో మొక్కజొన్న, 299 ఎకరాల్లో కందులుతో పాటు ఇతర పంటలు సాగు చేశారు.


ఎల్లమ్మ చెరువు కింద సాగు చేస్తున్న పొలాలు


కొద్ది మేర నీరు ఉన్న శనిగరం ప్రాజెక్టు


బెజ్జంకి మండలంలోని తోటపల్లి వరద కాలువ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ఉన్న నీరు

సాగు ముమ్మరం

డివిజన్‌లో ఉన్న ఏకైక చిన్నతరహా ప్రాజెక్టు శనిగరం. దీని సామర్థ్యం 27ఫీట్లు కాగా. ప్రస్తుతం 16 ఫీట్ల వరకు నీరు ఉంది. ప్రాజెక్టు కింద 5,100 ఎకరాల ఆయకట్టు ఉండగా ప్రస్తుతం పడుతున్న వర్షాలతో నార్లు పోసి, బావులు ఉన్న రైతులు పొలాలను దున్నుతున్నారు. 0.32 సామర్థ్యం ఉన్న బెజ్జంకి మండలం తోటపల్లి వరద కాలువ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 304.5 మీటర్ల నీరు ఉంది. ఇది 307.45 మీటర్లకు చేరితే మత్తడి పడుతుంది. దీని ద్వారా చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు సాగునీరు అందుతుంది. అలాగే 1800 ఆయకట్టు ఉండే హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువులో 30 శాతం నీళ్లున్నాయి. ఈ చెరువు కింద భూముల్లో వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి.

జూన్, జూలై నెలల్లో మెరుగైన వర్షపాతం నమోదు

డివిజన్‌లో జూన్, జూలై నెలల్లో మెరుగైన వర్షాపాతం నమోదైంది. జూలై నెలలో 26వ తేదీ వరకే కొన్ని మండలాల్లో సాధారణ వర్షాపాతం కంటే ఎక్కువ నమోదైంది.

వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో

	జూన్		జూలై(26వతేదీ వరకు)	
మండలం	సాధారణ	నమోదైంది	సాధారణ	నమోదైంది
హుస్నాబాద్	124.2	210.8	202.4	158.4
కోహెడ	112.6	237.0	169.2	261.4
బెజ్జంకి	127.2	216.1	184.0	223.5
మద్దూర్	116.6	198.7	168.4	190.3
అక్కన్నపేట	118.2	228.6	191.6	183.3
దూళిమిట్ట	55.5	227.0	84.2	190.6

బీమాతో రైతుకు ధీమా

- ఈనెల 30 వరకు రెన్యూవల్ ప్రక్రియ
- కొత్తగా దరఖాస్తులకు ఆహ్వానం
- ఐదెకరాలలోపు ఉన్న రైతులకు అవకాశం
- ఆగస్టు 5 వరకు నమోదు
- రైతు వేదికలలో స్వీకరిస్తున్న వ్యవసాయ అధికారులు

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 27 : వ్యవసాయంపై ఆధారపడ్డ అన్నదాతల కుటుంబాల్లో ఆకస్మాత్తుగా ఎదైనా కారణంతో కుటుంబ పెద్ద చనిపోతే వారంతా రోడ్డున పడుతారు. ఏమీ చేయలేని పరిస్థితిలో ఆ కుటుంబం కొట్టుమిట్టాడుతుంది. ఇలాంటి వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని అమలు చేస్తోంది. రూ.5 లక్షల చొప్పున అందిస్తూ ఆసరాగా నిలుస్తోంది. 18-59 మధ్య వయస్సున్న పట్టాదారులు ఇందుకు అర్హులు. ప్రస్తుతం వ్యవసాయశాఖ ఇందులో కొత్తగా చేరేందుకు అవకాశం కల్పించింది. రైతుల నుంచి దరఖాస్తు స్వీకరణను ప్రారంభించిన వ్యవసాయ అధికారులు ఆగస్టు 5లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

2020 నుంచి ఏడాదికోసారి దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్ర ప్రభుత్వం 2018 ఆగస్టు 15 నుంచి ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. నామినీకి రూ.5 లక్షల బీమా వర్తించేలా నిర్ణయించారు. రైతు మృతిచెందినప్పుడు వ్యవసాయ అధికారులు వివరాలు సేకరించి నామినీ ఖాతాలో పరిహారం జమయ్యేలా చేస్తున్నారు. తొలి రెండు సంవత్సరాలు ఎప్పటికప్పుడు దరఖాస్తులు స్వీకరించారు. 2020 నుంచి ప్రతీ వానాకాలంలో ఒకసారి మాత్రమే అర్హుల నుంచి సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. పథకంలో చేరిన రైతు పేరిట ప్రభుత్వమే ఎల్ఐసీకి రూ.3,457 ప్రీమియం చెల్లిస్తోంది. నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటిసారిగా రైతు బీమా ప్రీమియం చెల్లింపునకు ఏర్పాట్లు చేసింది.

కొత్తగా దరఖాస్తుల స్వీకరణ

ఈ ఏడాది భూముల క్రయ, విక్రయాల ద్వారా కొత్తగా జారీ అయిన పాస్‌పుస్తకాలకు సంబంధించిన రైతులకు కూడా రైతు బీమాకు ప్రభుత్వం దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా 21,235 కొత్త పాస్‌పుస్తకాలు రైతులకు అందాయి. వీరంతా వచ్చే నెల 5వ తేదీ వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి. రెన్యూవల్‌ను రాష్ట్ర ప్రభుత్వమే ఆటోమెటిక్‌గా గతంలో ఉన్న డేటా ప్రకారం చేస్తుంది. కొత్త పాస్‌పుస్తకదారులు రైతు వేదికలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. బీమా రెన్యూవల్ ఈనెల 30వ తేదీ వరకు ప్రభుత్వం పూర్తిచేయనుంది. అందులో నామినీ పేరును సరి చేసుకునేందుకు రైతులకు అవకాశాన్ని కల్పించింది. జిల్లా వ్యాప్తంగా 3.51 లక్షల మంది పట్టా పాస్‌పుస్తకదారులు ఉన్నారు. అయితే బీమా నిబంధనల ప్రకారం సుమారు 2.01 లక్షల మంది రైతుల పేర్లు రైతు బీమాలో నమోదయ్యాయి. ఇందులో 59 ఏళ్ల పైగా ఉన్నవారికి బీమా రెన్యూవల్ కాదు. మిగతా వారందరికీ రెన్యూవల్ అవుతుంది.

ఐదు ఎకరాలలోపు రైతుల గుర్తింపు

ఐదు ఎకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులను కచ్చితంగా గుర్తించి వారి ద్వారా వచ్చే నెల 5లోగా దరఖాస్తులు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. స్థానికంగా లేకున్నా, వలస వెళ్లినా వారిని గుర్తించి దరఖాస్తు చేయించనున్నారు. ఐదు ఎకరాలు పైబడి ఉన్న రైతులకు కూడా రైతుబీమా వర్తించనుంది. చిన్న, సన్నకారు రైతు మృతి చెందితే ఆ కుటుంబం నష్టపోకుండా ఉండేలా ప్రభుత్వం వారికి ప్రాధాన్యం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో సాంకేతిక సమస్యల కారణంగా రైతుబీమాకు నగదు రూ.5 లక్షలు అందక పోవడంతో పలు కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ తలెత్తకుండా నామినీ సమస్య రాకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.


చనిపోయిన రైతు వివరాలను సేకరిస్తున్న ఏఈవో (ఫైల్)

సద్వినియోగం చేసుకోవాలి



రైతులు బీమాను సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమాకు సంబంధించి విధివిధానాలు వెల్లడించింది. ప్రభుత్వ ఆదేశం మేరకు రైతు బీమా పథకాన్ని ప్రతీ రైతుకు వర్తింపజేస్తాం. కొత్తగా పాస్‌పుస్తకాలు అందిన రైతులు జిల్లాలో 21,235 మందికి ఉన్నారు. వారు వచ్చే నెల 5వ తేదీ లోగా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి. రెన్యూవల్‌కు సంబంధించి ఎవరైనా రైతులు నామినీ పేరును మార్చుకొనే అవకాశం ఉంటుంది. మార్చుకునే రైతులు ఉంటే మార్చుకోవచ్చు.

- మహేష్, డీఏవో

గజ్వేల్ జిల్లా ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

గజ్వేల్, జూలై 27: గజ్వేల్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం కాయకల్ప బృందం సభ్యులు పరిశీలించారు. బృందం సభ్యులు డాక్టర్ దశరథ్, విప్రశాంత్, జినరేందర్ రాజన్ ఆసుపత్రిలో పలు వార్డులలో కలియతిరిగి, రికార్డులను పరిశీలించారు. అనంతరం రోగులకు అందిస్తున్న సేవలను గూర్చి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వారికి పుష్పగుచ్ఛం అందజేసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్ స్వాగతం పలికారు. వారి వెంట ఆసుపత్రి ఆర్ఎంవో రాము, డాక్టర్లు శివప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ శాంతికుమారి, రోజ్‌మేరీ, విజయలక్ష్మి, శ్రీనివాస్, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ మెహరాజ్, గౌతమ్ ఉన్నారు.


గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శిస్తున్న కాయకల్ప బృందం సభ్యులు

రహదారులు అధ్వానం

చిన్నకోడూరు/రాయపోలు, జూలై 27 : రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చిన్నకోడూరులోని స్థానిక వివేకానంద విగ్రహం సమీపం నుంచి గ్రామ శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ సమీపం వరకు కిలో మీటరు మేర పాత బీటీ రోడ్డును తొలగించి మట్టిని పోసి వదిలేశాడు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ రోడ్డు గుంతలు ఏర్పడి బురదమయంగా మారింది. రాయపోల్ మండలం అనాజీపూర్, తిమ్మకపల్లి గ్రామాల మధ్య మట్టి రోడ్డు పరిస్థితి కూడా ఇంతే. బురద దారిలో వాహనదారులు నరకం చూస్తున్నారు.



చిత్తడిగా మారిన రాయపోల్ మండలంలోని అనాజీపూర్, తిమ్మకపల్లి రోడ్డు




చిన్నకోడూరు రోడ్డు బురదమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



రుణమాఫీ విషయంలో రైతులు అధైర్యపడొద్దు

నిజాంపేట, జూలై 27: రుణమాఫీ విషయంలో రైతులు అధైర్యపడవద్దని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. మండల పరిధిలోని నార్లాపూర్‌ను శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామంలో ఇప్పటివరకు లక్షలోపు రుణం ఉన్న 174 మంది రైతులకు మాఫీ వచ్చిందని, కొన్ని సాంకేతిక కారణాల వల్ల మాఫీ కాని వారు వ్యవసాయ విస్తరణ అధికారులను కలిసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమర్ సేనా రెడ్డి, ఏఈవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు స్రవంతి, రైతులు పాల్గొన్నారు.




తప్పుడు ప్రచారంతో జేఎన్‌టీయూ ప్రతిష్టను దిగజార్చొద్దు

పుల్కల్, జూలై 27: నిరాధారమైన ప్రచారం చేస్తూ సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రతిష్టను దిగజార్చవద్దని ప్రిన్సిపాల్ జీ.నరసింహ కోరారు. శనివారం తన ఛాంబర్‌లో వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావుతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొంతకాలంగా అదే పనిగా కళాశాలపై, తనపై లేనిపోని ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 160 ఎకరాల సువిశాలమైన సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు మంచిపేరు ఉందని, ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయని పేర్కొన్నారు. డబ్బులిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. కళాశాలలో నాలుగేళ్లపాటు కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు ఎవరైనా నో డ్యూ సర్టిఫికెట్ సమర్పించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కళాశాలలో నాలుగో ఏడాది ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులందరూ కూడా అకౌంట్ సెక్షన్ మొదలుకుని అకాడమిక్, ట్యూషన్, స్పెషల్ ఫీజ్, హాస్టల్ సెక్షన్, ఎగ్జామినేషన్ బ్రాంచి, గ్రంథాలయం, హెచ్‌వోడీ, క్రీడలు, ప్లేస్‌మెంట్ సెల్, రవాణ విభాగాలకు సంబంధించి నో డ్యూ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందన్నారు. రెగ్యులర్ స్టాఫ్ ఎనిమిది మంది మాత్రమే ఉన్నారని, మిగితా కాంట్రాక్టు ఫ్యాకల్టీ సహకారంతో కళాశాలను అగ్రగామిగా నిలుపుతున్నామన్నారు. తెలంగాణలో కూకట్‌పల్లి జేఎన్‌టీయూ, ఉస్మానియా యూనివర్సిటీ తర్వాత అత్యధిక డిమాండ్ ఉన్నది సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు మాత్రమేనన్నారు. కళాశాలపై, తనపై జరుగుతున్నవి కేవలం తప్పుడు ప్రచారాలేనని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈసీఈ హెచ్‌వోడీ రజనీష్, మెకానికల్ హెచ్‌వోడీ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ

















బల్దియాలో నయా దందా..!

- ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు
- సర్కారు భూములకు రెక్కలు
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

సదాశివపేట, జూలై 27: సంగారెడ్డి జిల్లా సదాశివపేట బల్దియాలో నయా దందా కొనసాగుతున్నది. ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు ఇచ్చి అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే పట్టణం చుట్టూ ఉన్న రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వానికి చెందిన (కందకం) స్థలాల్లో తిష్టవేసిన ఆక్రమణదారులకు గతంలో, తాజాగా ఇంటి నంబర్లను కేటాయించిన అధికారులు మరో అడుగుముందుకేశారు. పట్టణ పరిధిలోని అనేక ప్రాంతాల్లో భూ యజమాని హక్కు పత్రాలు(డాక్యుమెంట్లు) లేని ఖాళీస్థలాల్లో, ప్రైవేటు వెంచర్లలోని మున్సిపల్‌కు చెందిన పదిశాతం పార్కు స్థలాల్లో, ప్రభుత్వ స్థలాల్లో, మున్సిపల్ అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన అక్రమ వెంచర్లల్లో రోడ్లు, పార్కుల కోసం వదిలేసిన ఖాళీస్థలాల్లో, ప్రైవేటు, సర్కారు వివాదాస్పద భూముల్లో రాత్రికిరాత్రి ఏర్పాటు చేసిన తాత్కాలిక రేకుల షెడ్లు, రేకు డబ్బాల ఫొటోలను చూపుతూ ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారు. బల్దియా అధికారులు కేటాయించిన ఇంటి నంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు రిజిస్ట్రేషన్లు చేయడం విమర్శలకు తావిస్తున్నది. ఈ అడ్డగోలు అక్రమాలపై జూన్ 27న సదాశివపేట మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కొందరు కౌన్సిలర్లు తీవ్రస్థాయిలో అభ్యంతరం తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్లు, ఖాళీస్థలాల్లో కేటాయించిన ఇంటి నెంబర్లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సభ్యులు అభ్యంతరం తెలిపిన విషయాలపై సంబంధిత రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, మున్సిపల్ కమిషనర్ వివరణ ఇచ్చేందుకు నీళ్ల నమిలారు. దీంతో సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ఒకింత అసహనం వ్యక్తం చేశారు. సభ్యులు అభ్యంతరం తెలిపిన ఖాళీ స్థలాల్లో ఇంటి నంబర్ల కేటాయింపుపై బల్దియా, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

నిబంధనలకు నీళ్లు..

సదాశివపేట పట్టణాన్ని రాజులు పాలించిన చరిత్ర ఉన్నది. పట్టణానికి ప్రత్యేకంగా గ్రామకంఠం ఉన్నది. గ్రామకంఠం చుట్టూ పట్టణానికి నాలుగువైపులా అప్పట్లో రాజులు మూడు కిలోమీటర్ల మేర 100 ఫీట్ల వెడల్పుతో లోతైన కందకం తవ్వించారు. కాలక్రమంలో అక్రమార్కులు కందకాన్ని పూడ్చివేసి కబ్జాచేశారు. ఇప్పుడు బహిరంగ మార్కెట్‌లో కందకం స్థలం విలువ చదరపు గజం రూ.లక్షలకు పైగా పలుకుతున్నది. దీంతో కొందరు ఆక్రమణదారులు అధికారులను ప్రసన్నం చేసుకుని ఇంటి నంబర్లు పొందగా.. మరికొందరు భారీ వాణిజ్య భవన సముదాయాలు నిర్మించి సొమ్ము చేసుకుంటున్నారు. కందకం స్థలంలో దశాబ్దాల క్రితమే అక్రమాలకు బీజం పడడం విశేషం. ఈ క్రమంలో 2010లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు కందకం స్థలంలో ఉన్న ఆక్రమణలన్నింటినీ తొలగించాలని, కేటాయించిన ఇంటి నంబర్లను రద్దు చేయాలని, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని ఆదేశాలు జారీచేసింది. హైకోర్టు ఆదేశాలు నేటికీ అమలులో ఉన్నా.. అధికారులు ఈ మధ్యకాలంలో కందకం స్థలాల్లో ఇంటి నంబర్లు కేటాయించడం, కందకంలో నిర్మిస్తున్న నిర్మాణాల జోలికి వెళ్లకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఇదిలావుంటే గ్రామకంఠం లోపల సర్వే నంబర్లు ఉండవు. గ్రామకంఠం చుట్టూ ఉన్న కందకం స్థలం, గ్రామకంఠంలోపల ప్రజాప్రయోజనాల కోసం వదిలేసిన ఉమ్మడి ఖాళీస్థలాలు (పోరంబోకు) స్థలాల జాబితా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంటాయి. ఇక గ్రామకఠంలోని ఇళ్లకు,



భవనాలకు, ఇతర ఆస్తులకు ఎలాంటి డ్యాకుమెంట్లు ఉండవు. కేవలం ఇంటి నంబర్లు మాత్రమే ఉంటాయి. మున్సిపల్ రెవెన్యూ విభాగంలో అసిస్‌మెంట్ రికార్డుల్లో ఇంటినెంబర్లు, ఆస్తుల యజమానుల పేర్లు, ఆస్తికి సంబంధించిన కొలతలు నమోదై ఉంటాయి. వీటి ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు జరుగుతాయి. ఈ మధ్యకాలంలో గ్రామకంఠం లోపల ఉన్న కొన్ని ప్రైవేటు ఆస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరగకపోయినా సదరు ఖాళీస్థలాల్లో ప్రస్తుత ఆక్రమణదారు అని పేర్కొంటూ బల్దియా ఇంటి నెంబర్లు కేటాయించడం గమనార్హం. మరోవైపు గ్రామకంఠం బయట ఉన్న భూములకు రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్లు, భూమి యాజమాన్యం పత్రాలు, పట్టాదారు పాసుపుస్తకాలు ఉంటాయి. ఒకవేళ వ్యవసాయ భూములను వెంచర్లుగా ఏర్పాటు చేస్తే (సర్వే నంబర్, ప్లాట్ నంబర్లు) ఉంటాయి. కానీ మున్సిపల్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖలు బల్దియా పరిధిలో చాలాచోట్ల ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలకు, సర్వే నంబర్లు లేకుండా ఇంటి నెంబర్లు కేటాయించడం, ఆ ఇంటి నంబర్లను రిజిస్ట్రేషన్ల శాఖ రిజిస్ట్రేషన్ చేయడం, రిజిస్ట్రేషన్లను బల్దియా యంత్రాంగం మ్యూటేషన్ చేసి ఆమోదించడం వంటివి ఆన్‌లైన్‌లోనే జరిగిపోవడం గమనార్హం. కలెక్టర్ పట్టించుకుని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇటీవల జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్లు ఖాళీస్థలాలకు ఇంటి నెంబర్ల కేటాయించిన విషయాలను ప్రస్తావించారు. కమిషనర్‌గా నేను బాధ్యతలు చేపట్టిన తరువాత ఖాళీస్థలాలకు ఇంటి నెంబర్లు ఎక్కడా కేటాయించలేదు. ఈ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటాం.

- జె.ఉమా, మున్సిపల్ కమిషనర్

వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య


హర్షిత మృతదేహం

పటాన్‌చెరు, జూలై 27: ప్రేమ పెళ్లి చేసుకున్న ఐదునెలకే భర్త కట్నం వేధింపులు తాళలేక గృహిణి ఉత్మహత్య చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పటేల్‌గూడా సిద్ధార్థ కాలనీలో చోటు చేసుకున్నది. అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా శ్రీనివాస్‌రావుపేటలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొరివి అనిల్‌కుమార్ కుమార్తె కొరివిహర్షిత(22).. అదే జిల్లా ఎడ్లపాడు గ్రామానికి చెందిన అంగిడి మహేష్(25)ను ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రేమ వివాహం చేసుకున్నది. పెళ్లి సమయంలో రూ.3 లక్షల కట్నం సైతం మహేష్‌కు ముట్టజెప్పారు. నాలుగు నెలల క్రితం పటేల్‌గూడ సిద్ధార్థ కాలనీలో దంపతులు అద్దెకు దిగారు. కాగా మహేష్‌కు ఉద్యోగం లేకపోవడంతో ప్రతినెల రూ.30 వేలను అనిల్‌కుమార్ పంపిస్తున్నాడు. ఇటీవల మహేష్‌కు బెంగుళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. అయినా ప్రతినెల డబ్బులు పంపాలని, ఆస్తిలో వాటా రాసివ్వాలని భార్య హర్షితను మానసికంగా, శారీరకంగా వేధించడం ప్రారంభించాడు. మహేష్ వేధింపులు తట్టుకోలేక శుక్రవారం రాత్రి గదిలోని కిటికీకి చున్నీతో ఉరేసుకుని హర్షిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చెప్పులు, బ్యాగ్ కొనివ్వలేదని విద్యార్థిని ఆత్మహత్య


బుష్రాఫాతిమ మృతదేహం

పటాన్‌చెరు, జూలై 27: కొత్త చెప్పులు, కాలేజీ బ్యాగ్ కొనివ్వలేదని తల్లితో గొడవపడి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాజీవ్ స్వగృహాలో నివాసముండే బుష్రాఫాతిమ(18) డిగ్రీ చదువుతోంది. శనివారం ఉదయం ఫాతిమ తనకు కొత్తచెప్పులు, కాలేజీ బ్యాగ్ కొనివ్వాలని తల్లి జారీనాబేగంతో గొడవపడింది. త్వరలో కొనిస్తానని తల్లి చెప్పడంతో అలిగి గదిలోకి వెళ్లి గడియపెట్టుకుంది. ఎంత పిలిచినా తలుపు తెరవకపోవడంతో భర్త సయ్యద్‌జావేద్‌కు ఫోన్‌చేసి చెప్పింది. ఇంటికి చేరుకున్న జవేద్ తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫాతిగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఇద్దరు అంతర్‌జిల్లా దొంగల అరెస్ట్

- నిందితుల నుంచి బంగారం, విదేశీ కరెన్సీ స్వాధీనం

పటాన్‌చెరు, జూలై 27: తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలు అమీన్‌పూర్ పోలీసులకు చిక్కారు. శనివారం పటాన్‌చెరు పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఐడీఏ బొల్లారంలో నివాసముండే యూపీవీసీ కిటికీలు తయారు చేసే రవి, పెయింటింగ్ పనిచేసే సోమశేఖర్ కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. పగలు పనిచేసుకుంటూ తాళం వేసిన ఇళ్ల వివరాలను సేకరించి దోపిడీలకు పాల్పడేవారు. గతనెల 28న అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగమయ్య కాలనీలో నివాసముండే లిఖిత్‌పవన్ అనే వ్యాపారి ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి అరుణాచలం వెళ్లారు. తాళం పగులగొట్టి బీరువాలోని బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను అరెస్ట్ చేశారు. వీరు గతంలో బొల్లారం, దుండిగల్, అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 7 దొంగతనాలకు పాల్పడ్డారని విచారణలో తేలింది. నిందితుల నుంచి 10 తులాల బంగారం, వెండి సామగ్రి, విదేశీ కరెన్సీ, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను అరెస్ట్ చేయడంతో చాకచక్యం ప్రదర్శించిన అమీన్‌పూర్ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

చెట్టుకు బైక్ ఢీకొని యువకుడి మృతి


సాయికుమార్ (ఫైల్)

ములుగు, జూలై 27: బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన కొత్తూరు గ్రామ సమీపంలో జరిగింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. ములుగు గ్రామానికి చెందిన బుల్లి సాయికుమార్(22) శుక్రవారం సాయంత్రం తన స్నేహితుడు తిగుళ్ల శివకుమార్ ఇంటికి రాగా.. ఇద్దరూ బైక్‌పై బయటకు వెళ్లారు. రాత్రి 12 గంటల సమయంలో మండల పరిధిలోని కొత్తూరు గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనగా పడిపోయారు. ఈ ఘటనలో సాయికుమార్ అక్కడికక్కడే మృతిచెందగా.. శివకుమార్‌కు గాయాలయ్యాయి. సాయికుమార్ డీసీఎం డ్రైవర్‌గా పనిచేసేవాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

సంగారెడ్డిలో 'సకురా జపాన్'


సంగారెడ్డి అర్బన్: సంజయ్‌ను సన్మానిస్తున్న జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి

సంగారెడ్డి అర్బన్/సిద్దిపేట క్రైం, జూలై 27: సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో సకురా జపాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాస్థాయిలో విద్యార్థులకు టెస్ట్ నిర్వహించారు. జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, టీఆర్‌ఈఐఎస్ పాఠశాలల నుంచి 16 మంది విద్యార్థులు టెస్ట్‌కు హాజరయ్యారు. ఈ టెస్ట్‌లో బస్వాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి పి.సంజయ్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లా నుంచి ఎంపికైన ఒక్కో విద్యార్థి, ఇలా 33 జిల్లాల నుంచి చివరగా ఐదుగురిని ఎంపిక చేసి, నవంబర్ 10 నుంచి 16వ తేదీవరకు జపాన్‌లో జరిగే సకురా సైన్స్ కార్యక్రమానికి ఎంపికచేసి జపాన్‌కు తీసుకెళ్లనున్నారు. ఎంపికైన విద్యార్థి సంజయ్‌ను డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, గైడ్ టీచర్లు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు. అలాగే సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థిని సృజన రాష్ట్రస్థాయికి ఎన్నికైనట్లు జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ తెలిపారు. సృజనను సిద్దిపేటలోని మల్టీపర్పస్ స్కూల్‌లో అభినందించారు.

ఆపదలో ఆపన్నహస్తం.. డయల్ 100

- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై 27: ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తంలా డయల్ 100 పనిచేస్తుందని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బ్లూకోట్స్, పెట్రో కార్ సిబ్బందితో డయల్ 100 కాల్స్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, మనతీరు జనం మెచ్చేలా ఉండాలనే ఉద్దేశంతో పోలీసు విభాగం కొన్ని వ్యవస్థల్ని ఏర్పాటు చేసిందన్నారు. అందులో భాగంగా 100 నెంబర్‌తో కంట్రోల్ రూంను అందుబాటులోకి తెచ్చిందన్నారు. 100 విధానానికి మరింత సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శకత, జవాబుదారీతనం జోడించిందని చెప్పారు. ప్రతి ఫోన్‌కాల్‌ను రికార్డు చేసే సిబ్బంది, వెంటనే ఆ సమస్య పరిష్కారమయ్యాకే దాన్ని క్లోజ్ చేస్తారన్నారు. అత్యవసర, విపత్కర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కావాలనుకునేటప్పుడు తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.

పురుగుల అన్నం ఎలా తినాలి..?


ఉపాధ్యాయులు, వంట కార్మికులతో వాగ్వివాదానికి దిగిన విద్యార్థులు

మిరుదొడ్డి, జూలై 27: పురుగుల అన్నం ఎలా తినాలంటూ విద్యార్థుల ఉపాధ్యాయులు, వంటకార్మికులతో వాగ్వివాదం దిగిన సంఘటన శనివారం మిరుదొడ్డి మండలం చెప్యాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలనే ఉద్దేశంలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్నదని, కానీ వంట కార్మికులు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం మూలంగా పురుగుల అన్నమే వడ్డిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనంలో పురుగుల వస్తున్నాయని ఉపాధ్యాయులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పురుగులు లేని అన్నం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రేగోడ్ కేజీబీవీలో జడ్పీ సీఈవో తనిఖీ

రేగోడ్, జూలై 27: రేగోడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం జడ్పీ సీఈవో ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించి మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రధానంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదని, జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ


మాసాయిపేట మండల కేంద్రంలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మాసాయిపేట, జూలై 27: వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శనివారం మాసాయిపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. వివిధ గ్రామాల పహాని వివరాలు సరిగ్గా ఉన్నాయానని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలు హాజరుశాతంపై అంగన్‌వాడీ టీచర్ భూదేవిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని నాలుగవ తరగతిని సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. అలాగే మండలంలోని పలు వీధుల్లో పర్యటించి రైతులు, ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్ఞానజ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ ధన్‌సింగ్, గ్రామ కార్యదర్శి రాణమ్మ, రెవెన్యూ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి పరిశీలన

మాసాయిపేట, జూలై 27: మాసాయిపేటలోని చెట్ల తిమ్మాయపల్లి చౌరస్తా వద్ద గల రైల్వే అండర్ బ్రిడ్జి మార్గాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. నాలుగేళ్లుగా కొనసాగుతున్న బ్రిడ్జి పనులతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బ్రిడ్జి ప్రదేశానికి వెళ్లి పరిశీలించి వెంటనే రిపోర్టు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు.

నాచగిరిలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం


ఆలయ మండపంలో విష్ణు సహస్రనామర్చణ పారాయణం చేస్తున్న సేవాసమితి బృందం

వర్గల్, జూలై 27: ఆషాఢమాసం చివరి శనివారం పురస్కరించుకుని వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో శ్రీవిష్ణు సహస్ర పారాయణ సత్సంగ సమితి, భ్రమరాంబిక సేవాసమితి ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామర్చణ పారయణం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ ముందుగా స్వామివారి చిత్రపటానికి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో సుమారు వందమందిచే రెండు గంటలపాటు విష్ణు సహస్రనామార్చణ పారాయణం కొనసాగింది. కార్యక్రమం అనంతరం సేవాసమితి బృందం సభ్యులు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణను సన్మానించారు. విష్ణు సహస్రనామర్చణ పారాయణం నిర్వహించినందుకు శ్రీవిష్ణు సహస్ర పారయణ సత్సంగ సమితి అధ్యక్షుడు కొండ సూర్యనారయణ, భ్రమరాంబిక సేవాసమితి అధ్యక్షులడు మహాలక్ష్మిని ఆలయ కార్యనిర్వహణ అధికారి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటు ఆలయ సిబ్బంది, భక్త బృందం పాల్గొన్నారు. సహస్ర పారాయణం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తిపారవశ్యమయ్యాయి.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

- 50 గ్రాముల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

వర్గల్, జూలై 27: వర్గల్ మండలం చాంద్‌ఖాన్ మక్త గ్రామ సమీపంలో గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్, గౌరారం పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం, మాధేపురా జిల్లా, యోగిరాజ్ గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ మైలారం గ్రామ సమీపంలోని శ్రీవాణి రైస్‌మిల్‌లో హమాలిగా పనిచేస్తుంటాడు. గత శుక్రవారం వర్గల్ మండలం చాంద్‌ఖాన్ మక్త గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద గంజాయిని విక్రయిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ జానకీరాంరెడ్డి, గౌరారం ఎస్ఐ ఆధ్వర్యంలో వెళ్లి పట్టుకుకోగా భయాందోళన చెందాడు. బైక్ టూల్ బాక్స్‌లోని ప్లాస్టిక్ కవరులో ఉన్న గంజాయిని, ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బీహార్ రాష్ట్రం, భగల్‌పూర్ జిల్లా తోప్ర గ్రామానికి చెందిన వీరుచౌదరి వద్ద గంజాయిని కొనుగోలు చేసి తాను తాగుతూ మిగిలిన దానిని వర్గల్ చుట్టుపక్కల గ్రామాల యువకులకు, కార్మికులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

సొంతూరిలో దొంగతనం.. పక్క జిల్లాలో అరెస్ట్


జ్ఞానేశ్వర్‌ను అదుపులోకి తీసుకుంటున్న సీఐ రేణుకారెడ్డి

చేర్యాల, జూలై 27: దొంగతనానికి పాల్పడిన మెదక్ జిల్లా రేగోడు మండలం ముక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిని పోలీసులు శనివారం చేర్యాలలో అదుపులోకి తీసుకున్నారు. ముక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ మిషన్ భగీరథ సిబ్బందిగా పనిచేస్తూ చేర్యాల పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాలో అద్దెకు ఉంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వెళ్లిన జ్ఞానేశ్వర్ ఈనెల 25న తాళంవేసిన ఇంట్లో చోరీకి పాల్పడి రూ.2.15 లక్షల విలువైన నగదు, బంగారం అపహరించాడు. ఈ విషయమై అక్కడ కేసునమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టిన క్రమంలో జ్ఞానేశ్వర్‌ను నిందితుడిగా గుర్తించారు. దీంతో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి శనివారం చేర్యాలలో అద్దెకు ఉంటున్న ఇంట్లో సోదాలు నిర్వహించి రూ.1.20 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. జ్ఞానేశ్వర్‌తో పాటు అతడి భార్యను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

మున్సిపల్ ఆదాయానికి గండి

- షాపింగ్ కాంప్లెక్స్ వేలం పాటలో మాయాజాలం
- కుమ్మక్కైన పాటదారులు
- నామమాత్రపు ధరలకే దక్కించుకున్న వైనం


వేలంపాట ధరలను పెంచమంటూ పాటదారులను కోరుతున్న కౌన్సిలర్ చిట్టిబాబు

జోగిపేట, జూలై 27: అందోలు-జోగిపేట మున్సిపాలిటీ ఆదాయంలో భారీ గండి పడింది. వేలం పాటదారులు కుమ్మక్కై, నామమాత్రపు అద్దెకే పాటపాడి బల్దియాకు రావాల్సిన ఆదాయానికి గండికొట్టారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీకి జోగిపేటలోని గాంధీపార్కు వద్ద 12 దుకాణాలతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్ ఉన్నది. ఇందులో 9వ దుకాణానికి మరమ్మతులు ఉండగా.. మిగిలిన 11 దుకాణాలకు శనివారం బల్దియా సమావేశ మందిరంలో వేలం పాటలు నిర్వహించారు. సాక్షాత్తు చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుమల సమక్షంలోనే వేలం పాటదారులు నామమాత్రపు ధరలకే వేలం పాడడంతో అంతా అవాక్కయ్యారు.

శుక్రవారమే కుమ్మక్కు

కాగా వేలంపాట విషయంలో పాటదారులంతా... శుక్రవారమే కుమ్మక్కైయ్యారు. పైరవీకారులు కొందరు మధ్యవర్తిత్వం చేసి... పట్టణ శివార్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పాటదారులను పిలిచి సమావేశం నిర్వహించారని సమాచారం. ఎక్కువకు పాడి మున్సిపాలిటీకి లాభం కల్పించడం ఎందుకు నామమాత్రపు ధరలకు పాడుకుని వచ్చే ఆదాయం మనమే పంచుకుందామని పాటదారులకు సర్దిచెప్పడం విశేషం.

ప్రతీ పాటదారునికి రూ.25 వేలు

బిడ్లు వేసిన ప్రతీ పాటదారుడికి కనీసం రూ.25 వేలు దక్కేలా పైరవీకారులు పథక రచన చేశారు. కొన్ని దుకణాలకు 10 మందికిపైగా బిడ్లు రావడం, మరికొన్నింటికి నలుగురే రావాలని పథకం వేశారని తెలిసింది. ఎక్కువమంది పాటదారులున్న చోట దుకాణం దక్కించుకోవాలనుకున్న పాటదారుడు.. తాను కాకుండా మిగిలిన పాటదారులకు ఒక్కొక్కరికీ రూ.25 వేలు చెల్లించాలని నిర్ణయం జరిగింది. దాని ప్రకారం.. 9 మందికి రూ.2.25 లక్షలు చెల్లించారని సమాచారం. ప్రతిసారి కేవలం రూ.100 చొప్పున పెరుగుతూ.. అసలు దుకాణదారుడు అనుకున్న ఫిగర్ రాగానే, మిగతావారంతా పోటీ నుంచి తప్పుకున్నారు. ఇప్పటికే ఆయా షాప్‌లలో వ్యాపారాలు సాగిస్తున్నవారు, సెటప్ అయిన తమ వ్యాపారానికి ఇబ్బంది కలుగకూడదని ఏకంగా రూ.3 లక్షలు చెల్లించినట్లు సమాచారం.

షాప్ నెంబర్-2కు అధిక పోటీ

ఇదిలా ఉంటే.. 11 దుకాణాలలోని 2 నెంబరు దుకణానికి మాత్రమే వేలం పాటదారులు రింగ్ కాలేకపోయారు. ఈ దుకాణానికి ఎనిమిది మంది పోటీపడగా, అత్యధికంగా రూ.19,300లకు అరుణ్ తేజ్‌గౌడ్ అనే బిల్డర్ పాటపాడి దక్కించుకున్నాడు. మిగతా దుకాణాలన్నీ సర్కారు వారి పాట రూ.10 వేలకు కొంచెం అటుఇటుగానే పాడారు. షాప్ నెంబర్-2 మినహాయిస్తే.. అత్యధికంగా బిడ్ పాడిన ధర కేవలం రూ.10,900 (షాప్‌నెంబర్ -1) కావడం గమనార్హం.

పాటదారుల స్థానంలో.. ఇతరుల బిడ్డింగ్

నిబంధనల మేరకు ఒక్కో వ్యక్తి ఎన్ని దుకణాలకైనా వేలం పాటలో పాల్గొనవచ్చు. ఒకటి కంటే ఎక్కువ దుకాణాలు పొందకూడదు. కానీ ఓ వ్యక్తి నిబంధనలకు రెండు దుకాణాలను దక్కించుకోవడం గమనార్హం. వేలం పాటకు డీడీలు చెల్లించిన వ్యక్తే పాల్గొనాలి. కానీ అతనికి బదులుగా, వారి కుటుంబసభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు. ఇది ఒక ఎత్తైతే.. వేలంపాటదారుల సంతకాలను కూడా వారే పెట్టడం విశేషం. 1వ వార్డు కౌన్సిలర్ డాకూరి శివశంకర్, 17వ వార్డు కౌన్సిలర్ చిట్టిబాబులు మాత్రమే అధిక ఆదాయం రావాలని పట్టుబట్టారు. కానీ అటు చైర్మన్ కానీ, ఇటు కమిషనర్ కానీ ఏమాత్రం స్పందించకపోవడం విడ్డూరం. ఏకంగా కౌన్సిలర్ల కుటుంబసభ్యులే, తమ కుటుంబంలోని ఇతర సభ్యుల పేర్లపై బిడ్లు వేసి పాల్గొనడం మరీ దారుణం. మూడేళ్ల క్రితం ప్రతీ దుకాణానికి రూ.6 వేలను సర్కారు వారి పాటగా నిర్ణయించారు. అత్యధికంగా రూ.20,500కు బిడ్ కాగా, ఈసారి సర్కారు వారి పాట రూ.10 వేలకు పెరిగినా వేలంలో కేవలం ఒక్కషాపు మినహా మిగతావన్నీ సర్కారువారి పాటకు కొంచెం అటుఇటుగా పాడడం గమనార్హం.

దుకాణాలు దక్కించుకున్నవారు

షాప్ నెంబర్ -1 తుపాకుల క్రిష్ణ రూ.10,900, షాప్ నెంబర్-2 అరుణ్ తేజ్‌గౌడ్ రూ.19,300, షాప్ నెంబర్-3 సునేరియా వివేక్ రూ.10,600, షాప్ నెంబర్-4 అర్థం లక్ష్మీ రూ.10,500, షాప్ నెంబర్-5 జట్ల లక్ష్మి రూ.10,700, షాప్ నెంబర్-6 వుల్వాల శ్రావణి రూ.10,400, షాప్ నెంబర్-7 సునేరియా వివేక్ రూ. 10,700, షాప్ నెంబర్-8 రాంప్రసాద్ రూ.10,200, షాప్ నెంబర్-9 (ఎవరూ పాడలేదు), షాప్ నెంబర్-10 తుపాకుల నాగరాజు రూ.10,300, షాప్ నెంబర్-11 సోమ సీనయ్య రూ.10,300, షాప్ నెంబర్-12 హన్మంత్‌గారి లావణ్యరూ.10,300 వేలకు పాడారు.

సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడుదాం

● వైద్యశాఖ ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ వినోద్‌బాబ్జి



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌బాబ్జి

సిద్దిపేట టౌన్, జూలై27: సీపీఆర్ చేయడం ద్వారా పది మందిలో ఆరుగురి ప్రాణాలను కాపాడే అవకాశముందని వైద్యశాఖ ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ వినోద్‌బాబ్జి తెలిపారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులకు సీపీఆర్‌పై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ చేస్తే ప్రాణాలు దక్కే అవకాశముందన్నారు. కార్యక్రమంలో నాన్ కమ్యూనికబుల్ డీసీజెస్ జిల్లా కోఆర్డినేటర్లు రాజేందర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్ జిమ్‌లను వినియోగించుకోవాలి'

కోహెడ, జూలై 27: ఫిట్‌నెస్ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌లను యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మంద ధర్మయ్య సూచించారు. మండలంలోని తంగళ్లపల్లిలో శనివారం రైతు వేదిక వద్ద రూ. 5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఓపెన్ జిమ్‌కు భూమి పూజ చేశారు. జిమ్ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, నారాయణగౌడ్, వెంకటస్వామి, బాలకిషన్, లింగమూర్తి, సిద్దరెడ్డి, రాజు, మహేందర్, రాజు, సత్యనారాయణ, ఎల్లయ్య, మహ్మద్ అబ్దుల్ రఫీ, సంపత్‌కుమార్, శ్రీనాథ్ మహర్షి, శేఖర్ ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● డీఎల్‌పీవో మల్లికార్జున్

సిద్దిపేట రూరల్, జూలై 27: సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో మల్లికార్జున్ సూచించారు. సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల గ్రామాన్ని శనివారం సందర్శించారు. గ్రామంలోని పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శిల్పా, కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బండి శివకుమార్ మాజీ ఉపసర్పంచ్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

● **గజ్వేల్:** ఇళ్ల పరిసరాల చుట్టూ పరిశుభ్రత పాటించకపోయిన, ఖాళీ ప్లాట్లను శుభ్రంగా ఉంచకపోతే చర్యలు తప్పవని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు పరిధిలో ప్రజ్ఞాపూర్‌లో పాడుబడిన బావి యజమానులతో మాట్లాడి వెంటనే పూడ్చాలని సూచించారు. ప్లాటు యజమాని స్పందించకపోతే మున్సిపల్ ఆ స్థలానికి నోటీలు ఇచ్చి చర్యలు తీసుకుంటుందని చెప్పారు.



సిద్దిపేట రూరల్: పరిసరాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో మల్లికార్జున్, ఎంపీవో హరిప్రసాద్



గజ్వేల్: ప్రజ్ఞాపూర్‌లో పాడుబడిన బావిని పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్, కమిషనర్

వారితో స్థానిక కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, దుర్గాప్రసాద్, మున్సిపల్ అధికారులు శ్రీధర్‌రెడ్డి, రవీందర్, వార్డుసభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

● **సిద్దిపేట అర్బన్:** పరిసరాల పరిశుభ్రతను పాటించి నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని హెల్త్ ఆఫీసర్ సునంద పేర్కొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల, భట్టి రామన్నపల్లి గ్రామాల్లో పరిసరాలను పరిశీలించి ఫీవర్ సర్వే నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గీత అంగన్‌వాడీ టీచర్స్ లత, సరోజన, విజయ, లావణ్య, కారోబార్ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **నారాయణరావుపేట:** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు దీకొండ భాస్కర్ కోరారు. మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ యూత్ మండల విభాగం ఆధ్వర్యంలో తహసీల్దార్ ఉదయశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పాలకవర్గం లేకపోవడంతో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని, విధి కుక్కల స్వైర విహారం చేస్తూ చిన్నాపెద్ద తేడా లేకుండా అందరి పై దాడి చేసి గాయపరుస్తున్నాయని వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి, యువజన విభాగం నాయకులు బాబు, రూపీ, బబ్లు, శ్రీకాంత్, అజయ్‌గౌడ్, స్వామి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు



సిద్దిపేట అర్బన్ : ఫీవర్ సర్వేలో వివరాలు తెలుసుకుంటున్న హెల్త్ ఆఫీసర్



నారాయణరావుపేట: తహసీల్దార్ ఉదయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేంద్రమంత్రులు రాజీనామా చేయాలి

● కాంగ్రెస్ నాయకులు

దుబ్బాక, జూలై 27: రాష్ట్ర బీజేపీ కేంద్రమంత్రులు తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చశ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం దుబ్బాకలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రం నుంచి బీజేపీ తరపున 8మంది ఎంపీలను పార్లమెంట్‌కు పంపిస్తే బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రానికి నిధులను కేటాయించకుండా మోసం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వనరేష్, నాయకులు భరత్, రమేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, చంద్రారెడ్డి, సాయిగౌడ్, బాలవెంకట్, సలీం, రాజు, చంద్రం, సాయితేజ తదితరులున్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరాలి

● జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి

సిద్దిపేట క్రైం, జూలై 27: సిద్దిపేట మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శివానుభవ మండపంలో పట్టణ అధ్యక్షుడు కోడూరి నరేష్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజా సమస్యలపై పోరాడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చొప్పదండి విద్యాసాగర్,వంగ రామచంద్రారెడ్డి, నీలం దినేష్, బొమ్మగాని పద్మ, తొడుపునూరి వెంకటేశం, తమ్మిశెట్టి వీరేశం, పిట్ల నరేష్, బొడ్డు సునీల్, కృష్ణ, ఎయిర్టెల్ వెంకట సత్యనారాయణ, సాయిబాబా, సంతోష్, శ్రీనివాస్ ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలి'

చేర్యాల, జూలై 27: చేర్యాల మండలం షబాషీగూడెం గ్రామంలోని వీరభద్రస్వామి, శివాలయభూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఇతరులు చేస్తున్న భూసర్వేను నిలిపివేయాలని కోరుతూ శనివారం గ్రామస్థులు చేర్యాల తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఈవిషయమై పలువురు మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధితో పాటు అర్చకుడి భత్యంకోసం 1982లో పట్టాదారుడైన ఉప్పల రామచంద్రయ్య నాగపురి రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.705లో 7.30ఎకరాలభూమి దానపూర్వకంగా అందించాడని తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో 2013వరకు ఆలయభూమిగా నమోదు కావడంతో పాటు దేవాదాయశాఖ పరిధిలో అమలు జరిగినప్పటికీ 2016లో తప్పుడు పత్రాలతో పట్టాదారుడి కూతురు లక్ష్మి భూమిని కాజేసేందుకు ప్రయత్నించడంతో అడ్డుకున్నామన్నారు. భూమి విషయమై కోర్టులోదావా కొనసాగుతున్న క్రమంలో ఎలిషాల ఆనంద్‌కుమార్ సర్వే నిర్వహణకు దరఖాస్తు చేసుకోవడంతో స్థానికులకు నోటీసులు అందించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, స్వప్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గోరింట సంబురాలు

సిద్దిపేట క్రైం, జూలై 27: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో గోరింట సంబురాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డి. సుజాత, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ ఏశైలజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పి పల్లవి, కే.రాణి లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వాసం శ్రీనివాస్ పర్యవేక్షించారు. అధ్యాపకులు కె. శ్రీనివాస్, ఆర్. మహేందర్, ఎస్. మహేందర్, ఎం. శ్రద్దానందం తదితరులు పాల్గొన్నారు.



గోరింటాకు చూపుతున్న కళాశాల అధ్యాపకురాల్లు

గురుకుల విద్యార్థుల కోసం దంత వైద్య శిబిరం

సిద్దిపేట రూరల్, జూలై27: విద్యార్థులకు దంత ఆరోగ్యానికి భరోసా ఇవ్వడం అభినందనీయమని నారాయణరావుపేట మహాత్మా జ్యోతిబాపులే రాష్ట్ర బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగలత అన్నారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి ఎల్లంకి ఇంజనీరింగ్ కళాశాల భవనంలో శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంత హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ శ్రీనివాస్ విద్యార్థులకు నోటి పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, ఎటీపీ రవి, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉండేందుకే విధులు నిర్వహిస్తున్నాం

● సిద్దిపేట ఏసీపీ మధు

సిద్దిపేట రూరల్, జూలై 27: ప్రజల రక్షణతో పాటు భద్రతాభావాన్ని పెంచుతూ ప్రజలకు అండగా ఉండేందుకు తాము విధులు నిర్వహిస్తున్నామని సిద్దిపేట ఏసీపీ మధు పేర్కొన్నారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరులో శనివారం ప్రజలతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరు బృందాలుగా ఏర్పడ్డ పోలీసులు గ్రామంలోని అన్ని వీధులు, అనుమానాస్పద ప్రాంతాల్లో జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన చౌరస్తా వద్ద ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజలకు రక్షణ కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై దాడి చేసి రూ. 6000 విలువైన లిక్కర్, గుట్కాలు సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, వన్ టౌన్, త్రీటౌన్ సీఐలు లక్ష్మీబాబు, విద్యాసాగర్, రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి, ఎస్ఐలు బాలకృష్ణ, కృష్ణరెడ్డి, ఆసీఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ మధు

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

సిద్దిపేట అర్బన్, జూలై 27: మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, నూతన చట్టాలపై సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన కల్పిస్తూ త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీమ్ బృందం సభ్యులు కిషన్, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణకుమారి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తాం: ట్రాఫిక్ సీఐ

సిద్దిపేట క్రైం, జూలై 27: సిద్దిపేట పట్టణంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రిస్తామని నూతనంగా వచ్చిన ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం ఆయన సిద్దిపేట పట్టణంలోని రద్దీ ప్రాంతాలను, ట్రాఫిక్ పాయింట్లను, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తదితర ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐ ఉమేష్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'లబ్ధిదారుల ఇష్టం మేరకే పాడి పశువుల కొనుగోలు'

కోహెడ, జూలై 27: మహిళా శక్తి లబ్ధిదారులు పాడి పశువులను రాష్ట్రంలో లేదా ఇతర రాష్ట్రాల్లో గాని కొనుగోలు చేయవచ్చని డీపీఎం వాసుదేవ్ అన్నారు. శనివారం కోహెడలో సింగరాయ మండల సమాఖ్య ఆధ్వర్యంలో పాడి పశువులు కొనుగోలు చేయుటకు గుర్తించిన లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీఎం తిరుపతి, ఎస్ఎస్ఏ ఎం స్వప్న, సీసీలు, పశువైద్యాధికారి శ్రవణ్‌కుమార్ తదితరులు.



ఆషాఢమాసం చివరి వారం, హైదరాబాద్‌లో బోనాల జాతర కూడా చివరి వారం కావడంతో సిద్దిపేట చుట్టుపక్కల ప్రజలు హైదరాబాద్ బోనాల జాతరకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. సిద్దిపేట పాత, కొత్త బస్టాండ్ జాతరకు వెళ్లే ప్రయాణికులతో శనివారం కిక్కిరిసిపోయింది.

- సిద్దిపేట అర్బన్

కాంగ్రెస్ కొమురవెల్లి మండల కమిటీ ఎన్నిక

చేర్యాల, జూలై 27: కాంగ్రెస్ కొమురవెల్లి మండల కమిటీ కార్యవర్గ ఎన్నిక శనివారం మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఉపాధ్యక్షులుగా లింగంపల్లి శ్రీనివాస్, కాయిత శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శులుగా సనాది భాస్కర్, బుడిగె బిక్షపతి, కార్యదర్శులుగా జంగని రవి, స్వాములపల్లి రమేశ్, వెంకి కనకయ్య, కంకనాల ప్రవీణ్, పంజాల మల్లేశం, శెట్టిపల్లి విజేందర్‌రెడ్డి, బండి వెంకటేశ్ ఎన్నికయ్యారు. అనంతరం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వీరి వెంట రేష్మాబేగం ఉన్నారు.

ఆర్ఐకి సన్మానం

మిరుదొడ్డి, జూలై 27: జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెల్లుతున్న అక్బర్‌పేట-భూంపల్లి మండల ఆర్ఐ బిక్షపతిని శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్ సన్మానించారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి..

సిద్దిపేట క్రైం, జూలై 27: సుదీర్ఘ కాలం సేవలందించి ఈ నెలలో రిటైర్ అవుతున్న వ్యాయామ ఉపాధ్యాయుడు బండారుపల్లి శ్రీనివాసునీ సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో శనివారం జరిగిన పాఠశాల క్రీడా సమాఖ్య సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో పాఠశాలల సమాఖ్య కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం టీజీ పెటా, టీఎస్ పెటా అధ్యక్ష కార్యదర్శులు ఎరువా అశోక్, శ్రీనివాస్, తోట సతీష్, హరికిషన్‌లతో పాటు సీనియర్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మిరుదొడ్డి,జూలై 27: వచ్చే నెల 7, 8, 9న జంతర్‌మంతర్‌లో జరిగే చైతన్య దీక్షలను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు కోరారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

'అందమైన చేతిరాతతో మెరుగైన భవిష్యత్'

చిన్నకోడూరు, జూలై 27: విద్యార్థుల భవిష్యత్ వారి అందమైన చేతిరాతతోనే బాగుపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య పేర్కొన్నారు. చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 275 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన దాతలు గొల్లపల్లి మల్లారెడ్డి, పల్లె నర్సింహులు, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అన్నమయ్యరెడ్డి ఆర్థిక సహకారంతో చేతిరాత అభ్యాస పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

ఇసుక లారీ సీజ్

నంగునూరు, జూలై 27: అనుమతి లేకుండా నంగునూరు పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న లారీని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు రాజగోపాలపేట ఎస్ఐ అసిఫ్ తెలిపారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి



మొక్కలు నాటే పనులను పరిశీలిస్తున్న కమిషనర్

సిద్దిపేట టౌన్, జూలై27: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్, సుడా వైస్ చైర్‌పర్సన్ ప్రసన్నరాణి పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని ఇమాంబాద్ వద్ద సుడా సిబ్బంది మొక్కలు నాటుతున్న పనులను పరిశీలించారు. ఇమాంబాద్ రోడ్డు డివైడర్ మధ్యలో, రోడ్డుకు ఇరువైపులా గుంతలు తీసి మొక్కలను నాటాలని సిబ్బందికి సూచించారు. రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న రంగనాయకసాగర్ వద్ద నిర్వహిస్తున్న హాఫ్ మారథన్ కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ వనిత తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం వర్ధంతి



చేర్యాల: కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చేర్యాల/కోహెడ, జూలై 27: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 9వ వర్ధంతిని శనివారం చేర్యాల మండలం నాగపురి గ్రామంలో అబ్దుల్ కలాం సామాజిక సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు, స్థానికులు కలాంచిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, ప్రధానోపాధ్యాయులు అయిలయ్య, మల్లికార్జున్, సంస్థ గౌరవాధ్యక్షుడు తుమ్మ మల్లయ్య, కార్యదర్శి బండమీది కరుణాకర్, ఉపాధ్యక్షుడు గూడెపు మహేశ్, ప్రతినిధులు తలారి శ్రీనివాస్, నాగపురి సత్యనారాయణ పాల్గొన్నారు. కోహెడలో సామజిక కార్యకర్త పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులులర్పించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు చిట్యాల బాలరాజు, లక్ష్మీకాంతారావు, ఎత్తి మహేష్, రజనీకాంత్ పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

● బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతాలుయాదవ్

చేర్యాల, జులై 27: సెకండరీ, స్టేట్ ఎడ్యుకేషన్‌బోర్డు అనుమతులు పొందకుండా చేర్యాల పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్ శనివారం సిద్దిపేట డీఈవో శ్రీనివాస్‌రెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పాఠశాలలో పుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తుండటంతో పాటు ఫీజులు, యూనిఫాంల పేరిట వేలాది రూపాయలు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. వెంటనే పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, లేనియెడల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

నకిలీ నోటుతో విద్యుత్ బిల్లు చెల్లింపు



నకిలీ నోటు

మద్దూరు, జూలై 27: మండలం మర్మాములకు చెందిన ఓ వినియోగదారుడు రూ.200 నకిలీ నోటు ఇవ్వడంతో విద్యుత్ సిబ్బంది అయోమయానికి గురయ్యారు. విద్యుత్ బిల్లుల వసూలు కోసం బిల్‌కలెక్టర్ ఇస్తారి గ్రామానికి రాగా, ఓ వినియోగదారుడు బిల్లు చెల్లించాడు. కాసేపటికి లద్నూరు గ్రామానికి చేరుకున్న బిల్ కలెక్టర్ లెక్కింపు మిషన్‌తో నగదు లెక్కిస్తుండగా, రూ.200నోటు నకిలీది రావడంతో ఖంగుతిన్నాడు. క్షుణ్ణంగా పరిశీలించగా చిన్నారులు ఆట ఆడుకునే నోటుగా నిర్ధారించడంతో సదరు వినియోగదారుడికి తెలిపాడు.

చేర్యాలలో నకాశీ చిత్రకళ శిక్షణ తరగతులు

చేర్యాల, జూలై 27: కరిగార్ ఉత్థాన్ అప్‌స్కిల్లింగ్ ప్రోగ్రామ్-2024-25లో భాగంగా నకాశీ చిత్రకళను నేర్పించేందుకు చేర్యాల పట్టణంలోని టూరిజం గెస్ట్‌హౌజ్‌లో 51రోజులపాటు నిర్వహించతలపెట్టిన శిక్షణా తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంట్రల్ డెవలప్‌మెంట్ కమిషనర్ హ్యాండీక్రాఫ్ట్ హెచ్‌పీవోలు గౌతమ్ దత్త, చంచల్‌పాల్ పర్యవేక్షణలో 30మంది ఔత్సాహికులను ఎంపిక చేయగా, కేంద్ర మినిస్ట్రీ, టెక్స్‌టైల్స్‌శాఖ మంత్రి పవిత్రమార్గెరిటీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆడెపు నరేందర్, శిక్షణ నిర్వాహకుడు మధు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో చిక్కిన 55 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూలై 27: సిద్దిపేట ట్రాఫిక్ పోలీసులు, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, ఎస్ఐలు సిబ్బందితో వేరువేరుగా గతంలో పట్టణంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 55 మంది మద్యం సేవించి పట్టుబడ్డారు. వారిని శనివారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసి 55 మందికి రూ.38,000 జరిమానా విధించారు.

గత ప్రభుత్వ హయాంలో భూములు గుంజుకున్నారు

● బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ధరం గురువారెడ్డి

గజ్వేల్, జూలై 27: గత ప్రభుత్వ హయాంలో పేదల భూములను గుంజుకున్నారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ధరం గురువారెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన బీజేపీ నాయకులు మాదాడి జశ్వంత్‌రెడ్డితో కలసి విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేట నుంచి మొదలుకుంటే మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, సిద్దిపేట కలెక్టరేట్, వర్గల్ ఇండస్ట్రీయల్ పార్కు, ఆర్అండ్ఆర్ కాలనీలు ఇలా అన్ని చోట్ల జరిపిన భూసేకరణలో అవినీతి జరిగిందన్నారు. పేదలను, రైతులను బెదిరించి గత కలెక్టర్ వెంకట్రామారెడ్డి భూములను లాక్కున్నారని ఆరోపించారు. ఎలాంటి ప్రోసీజర్ లేకుండా సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ నిర్మాణానికి 42 ఎకరాల భూమికి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని 400 ఎకరాల భూమిని లాక్కున్నారని, సదరు భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారని ఆరోపించారు. గజ్వేల్ మండలం ముట్రాజ్‌పల్లిలో 342 ఎకరాల భూమి ఉంటే 397 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించారని, 55 ఎకరాల నష్టపరిహారం ఎవరికి ఇచ్చారని ప్రశ్నించారు. అవినీతి పరులు కాకపోతే కోట్లాది రూపాయలు ఏలా సంపాదించారని ప్రశ్నించారు. వెంకట్రామారెడ్డి అవినీతిపరుడని, ఆయన్ని జైలుకు పంపించే వరకు ఉద్యమం చేస్తానని గురువారెడ్డి ప్రకటించారు. ఆయనవెంట బీజేపీ జిల్లా కార్యదర్శి కుడిక్యాల రాములు, నత్తి శివకుమార్, దేవులపల్లి మనోహర్‌యాదవ్, మేక ఉమ, కిరణ్‌కుమార్‌రెడ్డి, నాగుముదిరాజ్, అయిల మహేందర్, నాయిని సందీప్, చెప్యాల వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరేశ్ తదితరులున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ధరం గురువారెడ్డి

అందుబాటులో శ్రీగంధం మొక్కలు

ములుగు, జూలై 27: అటవీ కళాశాల నర్సరీలో శ్రీగంధం మొక్కలు విక్రయించడానికి అందుబాటులో ఉన్నాయని కేర్ సొసైటీ జనరల్ సెక్రెటరీ సహాయ ఆచార్యులు మీలకూరి చిరంజీవిరెడ్డి తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో సెంటర్ ఫర్ ఆగ్రో ఫారెస్ట్ రిసెర్చ్ సెంటర్‌లో నాణ్యమైన శ్రీగంధం మొక్కలను రీసెర్చ్ సెంటర్‌లో ఒక లక్ష 75000 మొక్కలను పెంచామన్నారు. శ్రీ గంధం మొక్కల తోటల పెంపకంపై సూచనలు సంప్రదించాల్సిన నెంబర్ 7330969580కు అడిగి సూచనలు తెలుసుకోవచ్చని చిరంజీవిరెడ్డి తెలిపారు.

'పార్టీ సభ్యత్వం లేని వ్యక్తి చక్రధర్‌గౌడ్'

నంగునూరు జూలై 27: పార్టీ సభ్యత్వం లేని వ్యక్తి చక్రధర్ గౌడ్ అని, అతను చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునే రకమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తప్పెట శంకర్ ఆరోపించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. అధికార పార్టీ పేరు చెప్పి దళిత అధికారులను చిన్నచూపు చూస్తూ, వారి పై నిరాధారణమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

హైనా దాడిలో గొర్రెల మృతి



హైనా దాడిలో మృతిచెందిన గొర్రెలు

మద్దూరు, జూలై 27: హైనా దాడిలో గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. మద్దూరులోని కేజేఎస్ షీప్ ఫామ్ యాజమాని తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రోజులాగే గొర్రెలను ఫామ్‌లో తోలి ఇంటికి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం వచ్చేసరికి 14గొర్రెలు హైనా దాడితో మృతిచెందినట్లు తెలిపాడు.

'పోస్టుమార్టంకు లంచం తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

హుస్నాబాద్, జూలై 27: పోస్టుమార్టంకు లంచం తీసుకున్న హుస్నాబాద్ వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ కోరారు. ఈ విషయంపై ఆయన శనివారం హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి మండలం రేకొండకు చెందిన మెగిలి బొందయ్య శుక్రవారం మృతి చెందాడని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు, సిబ్బంది రూ. 6000 ఇస్తేనే పోస్టుమార్టం చేస్తామనడంతో కుటుంబసభ్యులు రూ.4000 వేలు ఇచ్చారని చెప్పారు. ఈ విషయం తనకు తెలిసి ఆస్పత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆ డబ్బు తిరిగి ఇప్పించానని మల్లేశ్ చెప్పారు.

'పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి'



సమావేశంలో మాట్లాడుతున్న విభీషణ్‌రెడ్డి

రాయపోల్, జూలై 27: పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని బీజేపీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు రాజాగౌడ్ అధ్యక్షతన శనివారం జరిగిన మండల బీజేపీ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి బీ. రవీందర్‌రెడ్డి రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం విభీషణ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఎస్సీమోర్చా మాజీ అధ్యక్షుడు ఎస్సీ మంకిడి స్వామి, జిల్లా బీజేపీ ఆర్మీ మోర్చా అధ్యక్షుడు నీల చంద్రం, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, కార్యదర్శి నీల స్వామి, నాయకులు భాస్కర్‌రెడ్డి, కృష్ణ, స్వామి పాల్గొన్నారు.

స్మశానవాటిక నిర్మించండి

● ప్రభుత్వాన్ని కోరిన లక్ష్మాపూర్ ముస్లింలు

గజ్వేల్, జూలై 27: కొమురవెల్లి మల్లన్నసాగర్ ముంపు గ్రామం అయిన లక్ష్మాపూర్ గ్రామ ముస్లిం మైనారిటీలకు (ఖబరస్థాన్) స్మశానవాటికను నిర్మించి ఇవ్వాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ ముస్లింలు శనివారం మీడియాతో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఓ ముస్లిం మహిళ గుండెపోటుతో చనిపోగా, స్మశానవాటిక లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడినట్లు తెలిపారు. ఆమె కూతురు గజ్వేల్‌కు చెందిన మహిళ కావడంతో గజ్వేల్‌లో ఖననం చేసేందుకు యత్నించగా, అక్కడి ముస్లింలు మొదట ఒప్పుకోలేదని, ఎంతో బతిమలాడిన తర్వాత ఒప్పుకున్నట్లు తెలిపారు. వెంటనే ఆర్అండ్ఆర్ కాలనీ లక్ష్మాపూర్‌కు ఖబ్రస్థాన్, మసీదును ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

ధర్మసమాజ్ పార్టీ సమావేశం వాయిదా

మిరుదొడ్డి, జూలై27: ఈనెల 28న సిద్దిపేటలో నిర్వహించబోయే జిల్లా సమావేశాన్ని వాయిదా వేసినట్టు ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చందు తెలిపారు. శనివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడారు. వర్షాల దృశ్య పార్టీ జిల్లా సమావేశాన్ని వాయిదా వేశామన్నారు. ఆయన వెంట డీఎస్‌పీ నాయకులు దీపక్, రవి, శ్రీకాంత్, దినేష్ తదితరులున్నారు.

పాఠశాలల్లో బోనాలు

మర్కుక్, జూలై 27: మండల పరిధిలోని చేబర్తి అంగన్‌వాడీ కేంద్రంలో బోనాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటలు పాడించి డ్యాన్సులు చేయించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు రాణి, స్వప్న తదితరులున్నారు.

● **చేర్యాల:** ఆషాడమాసాన్ని పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని పంచతంత్ర పాఠశాలలో బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సంప్రదాయబద్ధంగా బోనాలు తయారు చేశారు. పోతరాజుల వేషధారణతో విన్యాసాలు చేస్తూ, డప్పుచప్పుళ్ల దరువు నడుమ పాఠశాల నుంచి గడిమైసమ్మ ఆలయం వరకు ఊరేగింపు చేపట్టారు. సంప్రదాయాలను కాపాడుకోవాలని, భావితరానికి ప్రాశస్త్యాన్ని తెలియజేయాలని బోనాల సంబరాలు జరిపామని ప్రిన్సిపాల్ శ్యామల తెలిపారు.



చేర్యాల: బోనాల సంబరాలలో భాగంగా పోతరాజుల వేషధారణతో సందడిస్తున్న విద్యార్థులు



నారాయణరావుపేట: పాఠశాలలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో విద్యార్థులు

● **నారాయణరావుపేట:** చదువుతో పాటు మన సంస్కృతి, ఆచార సంప్రదాయాల గురించి విద్యార్థులకు తెలియజేసేందుకు బోనాల ఉత్సవాలను నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు స్వప్న తెలిపారు. ఆషాఢమాసం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని హనుమాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులు బోనాల పండుగ ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపకుడు బుడిమ బాల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.